# టెల్కోల గుప్పిట్లో యూజర్లు

- కస్టమర్ల నెత్తిన అప్‌డేట్ పిడుగులు
- ఇష్టం లేకున్నా 4జీ, 5జీలకు మారేలా పరిస్థితులు
- సంస్థల గుత్తాధిపత్యం
- అగమ్యగోచరంగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు



న్యూఢిల్లీ, జనవరి 30: భారతీయ టెలికం రంగంలో గుత్తాధిపత్యం నడుస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థలున్నా.. ప్రైవేట్ రంగ సంస్థలదే హవా. ఇదే ఇప్పుడు దేశంలో మొబైల్ వినియోగదారుల పాలిట శాపంలా తయారైంది. టెల్కోల అప్‌డేట్ ప్లాన్లు.. కస్టమర్లకు గుదిబండలుగా పరిణమిస్తున్నాయి మరి. ఆయా టెలికం సంస్థల పోకడ.. యూజర్లను బలవంతంగా అప్‌డేట్ వెర్షన్‌కు మారేలా చేస్తున్నది.

### అలా మొదలై.. ఇలా

దేశంలో మొబైల్ ఫోన్లు పరిచయమైన తొలి నాళ్లలో ఇన్‌కమింగ్ కాల్స్‌కూ చార్జీలు పడేవి. ఆ తర్వాత ఔట్‌గోయింగ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లపైనే చార్జీలుండగా.. ఇప్పుడు డాటాకు మాత్రమే చెల్లిస్తున్నాం. తీసుకునే డాటా ప్లాన్, కాలపరిమితినిబట్టి ధరలుంటున్నాయి. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు అపరిమితంగానే లభిస్తున్నా.. వీటికి విలువే లేకుండాపోయింది. మొబైల్ ఫోన్ ఇప్పుడు ఇంటర్నెట్ సాధనం అయ్యిందిమరి. టెలికం సంస్థల టెక్నాలజీ ఊపుతో సూపర్ కంప్యూటర్‌గానే ఆవిర్భవించిందన్నా అతిశయోక్తి కాదు. ఓటీటీల రాకతో స్మార్ట్ టీవీలకూ మొబైల్స్ చెక్ పెట్టేస్తున్నాయి. ఇక నాడు కీలక భూమిక పోషించిన ఎస్ఎంఎస్‌లను నేడు వాడుతున్న వారైతే దాదాపుగా కనుమరుగైపోయారు. అంతా వాట్సాప్‌నే వినియోగిస్తున్నారు. వాయిస్ కాల్స్‌కు బదులు వీడియో కాల్స్ చేసుకుంటున్నవారి సంఖ్యా పెరిగిపోతున్నది. దీంతో డాటాకు ప్రాధాన్యత ఏర్పడింది. రోజుకు 1.5 జీబీ, 2 జీబీ డాటా కస్టమర్లే అధికం. 3 జీబీ డాటా యూజర్లూ ఉంటున్నారు. ప్లాన్ రేటు ఎంత పెరిగినా బఫరింగ్‌ను మాత్రం భరించలేకపోతున్నారు మరి.

### డ్యూయల్ సిమ్‌కు చెల్లు

ప్రస్తుతం వినియోగిస్తున్న స్మార్ట్‌ఫోన్లలో ఇంచుమించుగా అన్నీ డ్యూయల్ సిమ్ మొబైల్సే. కానీ టెలికం సంస్థల టారిఫ్‌లతో అంతా సింగిల్ సిమ్‌కే పరిమితమవుతున్నారు. మరో సిమ్‌ను మెయింటేన్ చేయాలంటేనే జంకుతున్నారు. నిజానికి రెండు, మూడేండ్ల కిందటిదాకా కూడా ఒకొక్కరు రెండు, ఇంకొందరైతే మూడు ఫోన్ నంబర్లనూ యూజ్ చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో డ్యూయల్ సిమ్ ఆప్షన్‌కు అర్థమే లేకుండా పోయింది.

### ఇన్‌కమింగ్ కాల్స్‌కూ బ్రేక్

గతంలో రీచార్జ్‌తో సంబంధం లేకుండా ఇన్‌కమింగ్ కాల్స్ సౌకర్యం ఉండేది. కానీ ఇప్పుడు రీచార్జ్ చేస్తేనే ఔట్‌గోయింగ్ కాల్స్‌తో పాటు ఇన్‌కమింగ్ కాల్స్‌కూ వీలున్నది. దీంతో కాల్స్ చేయాల్సిన అవసరం లేకున్నా.. ఇన్‌కమింగ్ కాల్స్ కోసమైనా రీచార్జ్ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. ఇది ఫీచర్ ఫోన్ వినియోగదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నది. కొందరు స్మార్ట్ ఫోన్ యూజర్లకూ చికాకు తెప్పిస్తున్నది. తిన్నా, తినకున్నా.. ఫోన్‌లో బ్యాలెన్స్‌లు వేయాల్సి వస్తున్నది మరి.

### 5జీ కోసం..

4జీ రాకతో 2జీ, 3జీ స్మార్ట్‌ఫోన్లకు గుడ్‌బై చెప్పిన వినియోగదారులు.. ఇప్పుడు 5జీ వెనుక పరుగులు పెడుతున్నారు. మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే మొబైల్స్ అన్నీ కూడా 5జీ టెక్నాలజీతోనే వస్తున్నాయి. అయితే ఎంతో అప్‌డేట్ వెర్షన్ అయినప్పటికీ 5జీకి పనికిరాదన్న ఒకే ఒక్క కారణంతో 4జీ మొబైల్స్‌ను కొందరు యూజర్లు పక్కకు పడేస్తున్నారు. కానీ టెలికం సంస్థల తీరుతో ఇంకొద్ది రోజుల్లోనే అంతా తమకు ఇష్టం లేకున్నా.. టెలికం సేవల కోసం 5జీకి బలవంతంగా మారే పరిస్థితులు రాబోతున్నాయని ఇండస్ట్రీ అనలిస్టులు అభిప్రాయపడుతుండటం ఇప్పుడు ఒకింత కలవరపెడుతున్నది. ప్రభుత్వ రంగ టెలి కం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇంకా పూర్తిస్థాయిలో 4జీని సంతరించుకోక ముందే.. ప్రైవేట్ రంగ సంస్థలు 5జీ సేవల్ని ప్రారంభించేశాయి. బీఎస్ఎన్ఎల్‌కు కాకుండా 5జీ స్పెక్ట్రం వేలంలో ప్రైవేట్ రంగ సంస్థలకు పెద్దపీట వేసిన కేంద్ర ప్రభుత్వానిదే ఈ పాపం అని పలువురు మండిపడుతున్నారు. ఇక లక్షల కోట్ల రూపాయలు పెట్టి కొన్న స్పెక్ట్రంపై ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తున్న టెల్కోలు.. 2జీ, 3జీ సర్వీసుల్ని ఆపేస్తామంటున్నాయి. కస్టమర్లు 4జీకి మారాల్సిందేనని చెప్పుకొస్తున్నాయి. ఇప్పటికే అన్నీ ఒక్కటై ట్రాయ్‌పై వ్యూహాత్మకంగా ఒత్తిడి తెచ్చి టారిఫ్‌లను పెంచుకున్న కంపెనీలు.. 2జీ, 3జీ కస్టమర్లను బలవంతంగా 4జీకి రప్పించాలని ప్రయత్నిస్తున్నాయి మరి. అయితే కొంత కాలానికి 4జీ సంగతీ ఇంతేనన్నది నమ్మలేని నిజం. కానీ ఇప్పటికి కూడా కోట్లాది మంది ఫీచర్ ఫోన్లను వాడుతున్నారు. వీరందరికీ నిజంగా డాటా అవసరమే లేదు. టెలికం సంస్థలు కుమ్మక్కై చేస్తున్న పనులు ఇలాంటి వారిపై మోయలేనంత భారాన్ని వేస్తున్నాయన్న ఆందోళనలు సర్వత్రా వినిపిస్తున్నాయిప్పుడు. ధరలు తగ్గించి స్మార్ట్‌ఫోన్లు అందరికీ లభించేలా చర్యలు తీసుకోవాలని టెలికం సంస్థలు కేంద్రాన్ని కోరుతుండటం కొసమెరుపు. అయితే ఫోన్ కొన్న తర్వాత డాటా ప్లాన్ల కొనుగోలు సంగతేంటన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నే. మొత్తానికి ఒకప్పుడు 10కిపైగా టెలికం సంస్థలతో పోటాపోటీగా సాగిన మార్కెట్‌లో వినియోగదారుడే కింగ్. ఇప్పుడు మాత్రం ప్రైవేట్ కంపెనీలదే రాజ్యం. ప్రభుత్వ సంస్థలు నామమాత్రమైతే ఇంతకన్నా ఏం జరుగుతుంది మరి.



# రెడ్డీస్ లాభం 1,379 కోట్లు


## క్యూ3లో 11 శాతం పెరిగిన ప్రాఫిట్

హైదరాబాద్, జనవరి 30: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.1,379 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,247 కోట్లతో పోలిస్తే 11 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.6,770 కోట్ల నుంచి రూ.7,215 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. ఉత్తర అమెరికా, యూరప్ మార్కెట్లు ఆశాజనకంగా ఉండటం కంపెనీకి కలిసొచ్చింది. ముఖ్యంగా ఇక్కడి మార్కెట్లోకి కొత్త ఔషధాలను విడుదల చేయడంతోపాటు గత మందులకు డిమాండ్ అధికంగా ఉండటం కూడా ఆదాయం పెరగడానికి దోహదం చేసినట్లు వెల్లడించింది.

- ఉత్తర అమెరికాలో కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 9 శాతం ఎగబాకి రూ.3,349 కోట్లకు చేరుకున్నాయి.
- యూరప్ నుంచి రావాల్సిన ఆదాయం 15 శాతం ఎగబాకి రూ.500 కోట్లకు చేరాయి.
- భారత్‌లో కంపెనీ ఔషధాలను విక్రయించడంతో రూ.1,180 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే త్రైమాసికం కంటే ఇది 5 శాతం అధికం.
- అలాగే అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి రూ.1,283 కోట్లు లభించాయి.
- అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలు విక్రయించడంతో రూ.6,309 కోట్ల నిధులు సమకూరాయి.
- ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో రూ.20,833 కోట్ల ఆదాయంపై రూ.4,261 కోట్ల నికర లాభాన్ని గడించింది.
- ఔరిజెన్ ఆంకాలజీలో రూ.650 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనకు బోర్డు అనుమతినిచ్చింది.
- కంపెనీ షేరు ధర రూ.5,845.75 వద్ద ముగిసింది.

*మరో త్రైమాసికంలో రికార్డు స్థాయి విక్రయాలను కనబరిచాం. నూతన ఔషధాలను యూరప్, అమెరికా మార్కెట్లోకి విడుదల చేయడం కలిసొచ్చింది. అనుబంధ వ్యాపారాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలను వేగవంతం చేయడంతోపాటు మాలుక్యుల్స్ కోసం వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటున్నాం.*

*- జీవీ ప్రసాద్, డాక్టర్ రెడ్డీస్ కో-చైర్మన్, ఎండీ*



# అమ్మకాల ఒత్తిడిలో మార్కెట్లు

**సెన్సెక్స్ 802 పాయింట్లు పతనం . 215 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ . రిలయన్స్, ఐటీసీ షేర్లకు భారీ నష్టాలు**

ముంబై, జనవరి 30: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీలు లాభాలను కొనసాగించలేకపోయాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 801.67 పాయింట్లు లేదా 1.11 శాతం పడిపోయి 71,139.90 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే 865.85 పాయింట్లు దిగజారింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 215.50 పాయింట్లు లేదా 0.99 శాతం క్షీణించి 21,522.10 వద్ద స్థిరపడింది. సోమవారం రికార్డు స్థాయిలో లాభాలు అందుకున్న విషయం తెలిసిందే. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లను ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మేశారు. ఈ క్రమంలోనే ఓవరాల్ ట్రేడింగ్‌పై ఈ ప్రభావం పడింది.

### ఆఖర్లో సెల్లింగ్ ప్రెషర్

ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ వస్తుండటంతో పెద్దగా నిర్ణయాలేమీ ఉండబోవన్న అంచనాకు వచ్చిన మదుపరులు సేఫ్ గేమ్ ఆడినట్టు మార్కెట్ ట్రేడింగ్ తీరును నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగానే ఫాగ్ ఎండ్ సెల్లింగ్ తీవ్రంగా జరిగిందని చెప్తున్నారు. ఆసియాలోని కీలక మార్కెట్లలోనూ నష్టాలు నమోదు కావడం, వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం యథాతథంగానే ఉండొచ్చన్న ఊహాగానాలు సైతం మదుపరులను కొనుగోళ్లకు దూరం చేశాయని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వీపీ (రిసెర్చ్) ప్రశాంత్ తాప్సీ అన్నారు.

### మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లూ..

బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లూ సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.53 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం చొప్పున పడిపోయాయి.

### మారుతీని దాటేసిన టాటా మోటర్స్

మార్కెట్ విలువలో మారుతీ సుజుకీని టాటా మోటర్స్ అధిగమించింది. దీంతో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో దేశీయ అతిపెద్ద ఆటో రంగ సంస్థగా టాటా మోటర్స్ అవతరించింది. మంగళవారం బీఎస్ఈ ట్రేడింగ్‌లో టాటా మోటర్స్ షేర్ల విలువ 2 శాతానికిపైగా పెరిగింది. దీంతో సంస్థ మదుపరుల సంపద రూ.3,14,635.06 కోట్లకు చేరింది. మారుతీ సుజుకీ షేర్ నష్టపోవడంతో మార్కెట్ విలువ రూ.3,13,058.50 కోట్ల వద్దే ఉన్నది.

## నిధుల సేకరణలో ఇండెల్ మనీ

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెల్ మనీ లిమిటెడ్ మరోసారి నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు(ఎన్‌సీడీ) జారీ చేసింది. ఈ నెల 30న ప్రారంభమైన ఈ ఎన్‌సీడీల ఇష్యూ వచ్చే నెల 12న ముగియనున్నదని కంపెనీ ఎగ్జిక్యూటివ్ హోల్‌టైం డైరెక్టర్ ఉమేశ్ మోహనన్ తెలిపారు. ఈ ఎన్‌సీడీ ద్వారా మొత్తంగా రూ.200 కోట్లు సేకరించాలని నిర్ణయించింది. ముఖ విలువ రూ.1,000గా నిర్ణయించింది. కనీసంగా 10 ఎన్‌సీడీలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేవలం 72 నెలల్లో తమ పెట్టుబడులు రెండింతలు కానున్నాయి. కూపన్ రేటును 12.25 శాతంగా నిర్ణయించింది. ప్రస్తుతం తెలంగాణలో 18 శాఖలు ఉండగా, కొత్తగా 12 శాఖలను ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

# ఆర్అండ్‌డీ కోసం ఏటా 55 కోట్లు

## ఎన్ఎస్ఎల్ గ్రూపు చైర్మన్ ప్రభాకర్ రావు


హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ విత్తనాల సంస్థ నూజివీడు సీడ్స్ లిమిటెడ్ పరిశోధన రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి భారీ పెట్టుబడులు పెట్టబోతున్నది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి ఏటా ఆర్అండ్‌డీ కోసం రూ.50-55 కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నట్లు ఎన్ఎస్ఎల్ గ్రూపు చైర్మన్ ప్రభాకర్ తెలిపారు. కొత్తగా 30 వంగడాలను విడుదల చేయబోతుండటంతో వచ్చే నాలుగు నుంచి ఐదేండ్లకాలంలో కంపెనీ ఆదాయం మూడింతలు పెరిగే అవకాశం ఉందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.1,100 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుతం సంస్థకు పది రాష్ర్టాల్లో 13 ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, అలాగే 2 వేలకు పైగా ఉద్యోగులు ఉన్నారు. వచ్చే ఐదేండ్లలో విత్తన అమ్మకాల్లో 30 శాతం వృద్ధిని సాధించనున్నదన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు.




# హైదరాబాద్‌లో పోర్షే షోరూం

న్యూఢిల్లీ, జనవరి 30: లగ్జరీ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ పోర్షే...దేశీయంగా తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. భారత్‌లో కంపెనీకి చెందిన కార్లకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో( జూన్ నాటికి) హైదరాబాద్‌తోపాటు పుణెల్లో కొత్తగా రిటైల్ అవుట్‌లెట్‌ను ప్రారంభించబోతున్నట్లు పోర్షే ఇండియా బ్రాండ్ డైరెక్టర్ మనోలిటో వ్యూజిసిస్ తెలిపారు. 2023లో సంస్థ దేశీయంగా 914 యూనిట్ల వాహనాలను విక్రయించింది. అంతక్రితం ఏడాదిలో అమ్ముడైన వాహనాల కంటే 17 శాతం అధికమని ఆయన పేర్కొన్నారు. వీటిలో 65 ఎలక్ట్రిక్ వాహనాలు కూడా ఉన్నాయన్నారు. గతేడాదిలో సంస్థ రికార్డు స్థాయి వాహనాలను విక్రయించినట్లు, అత్యంత విలాసవంతమైన వాహనాలను కోరుకుంటున్నవారు రోజురోజుకు పెరుగుతుండటంతో ఇక్కడ విక్రయాల్లో రెండంకెల వృద్ధిని సాధించినట్లు చెప్పారు. ఇదే క్రమంలో 2024లోనూ పలు నూతన వాహనాలను ఇక్కడి మార్కెట్‌కు పరిచయం చేయనున్నట్లు ప్రకటించారు.

# ట్రాయ్ చైర్మన్‌గా అనిల్ లహోటి



న్యూఢిల్లీ, జనవరి 30: రైల్వే బోర్డ్ మాజీ చీఫ్ అనిల్ కుమార్ లహోటి..టెలికం రెగ్యులేటరీ అథార్టీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) చైర్మన్‌గా నియమితులయ్యారు. ట్రాయ్ చైర్మన్ పీడీ వాఘేలా పదవీకాలం నాలుగు నెలల క్రితం ముగియడంతో ఈ పదవిలో ఇప్పటివరకు ఎవర్నీ కేంద్రం నియమించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ది అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ మంగళవారం సమావేశమై అనిల్ కుమార్ లహోటిని ట్రాయ్ చైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడేండ్ల పాటు కొనసాగనున్నారు.

# ఐకియా డోర్‌స్టేప్ డెలివరీ

- 62 కొత్త మార్కెట్లలో పరిచయమైన సేవలు
- తెలంగాణ, ఏపీసహా నాలుగు రాష్ర్టాల్లో సౌకర్యం

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రముఖ ఫర్నీచర్ రిటైలర్ ఐకియా.. మార్కెట్ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నది. ఈ క్రమంలోనే ఆయా రాష్ర్టాల్లో 62 చోట్ల డోర్‌స్టేప్ డెలివరీ సౌకర్యాలను పరిచయం చేసింది. ఇందులో తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రాంతాలున్నాయి. సమీప ఐకియా స్టోర్ల నుంచి కస్టమర్ల ఇంటి వద్దకు సర్వీసులుంటాయి. దీనివల్ల కస్టమర్లకు ఎంతో సమయం ఆదా అవుతుందని, ఖర్చులూ కలిసొస్తాయని ఐకియా చెప్తున్నది.

### ఆన్‌లైన్‌పై దృష్టి

ప్రస్తుతం ఐకియా ఇండియా అమ్మకాల్లో దాదాపు 25 శాతం ఆన్‌లైన్ వేదికగానే జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరుగుతుందని సంస్థ బలంగా విశ్వసిస్తున్నది. ఈ నేపథ్యంలో ఫోన్ అసిస్టెన్స్ సర్వీస్ ద్వారా షాపింగ్ వెసులుబాటునూ కల్పించబోతున్నట్టు సంస్థ సీఈవో సుసన్నే పుల్వేరర్ పీటీఐకి తెలిపారు. కాగా, తీరికలేని ఈ యాంత్రిక జీవనంలో షాపింగ్ కోసం అదనంగా మరింత సమయాన్ని వెచ్చించకుండా, ట్రాఫిక్ కష్టాలను తప్పించుకునేలా ఆన్‌లైన్ షాపింగ్‌కు పెద్దపీట వేస్తున్నట్టు సుసన్నే చెప్పారు. అలాగే భౌతిక స్టోర్లనూ పెంచుకుంటూ ముందుకెళ్తామన్నారు.

# డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం మిస్

## బడ్జెట్ 2024-25



న్యూఢిల్లీ, జనవరి 30: వరుసగా ఆరో ఏడాదీ కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం నెరవేరే అవకాశాలు కన్పించడం లేదు. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల వాటాల్ని విక్రయించి రూ. 51,000 కోట్లు సమీకరించాలని నిరుడు బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే మార్చి 31కల్లా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేటప్పటికి, అందులో సగం కూడా సేకరించడానికి ప్రభుత్వం నానా అగచాట్లు పడుతున్నది. ఇప్పటివరకూ రూ.10,051.73 కోట్లు మాత్రమే సమీకరించినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) వెబ్‌సైట్ వెల్లడిస్తున్నది. ఇందులో చాలావరకూ పీఎస్‌యూల పబ్లిక్ ఆఫర్ ద్వారా సమకూరినవే. 2022లో ఎయిర్ ఇండియా, నీలాచల్ ఇస్పాత్ నిగమ్‌లను ప్రైవేటుపరం చేసిన తర్వాత ఇప్పటివరకూ మరో పీఎస్‌యూను ప్రైవేటుకు విక్రయించలేకపోవడంతో డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా కుంటుపడింది. బీపీసీఎల్, షిప్పింగ్ కార్పొరేషన్ తదితర కొన్ని పీఎస్‌యూలను ప్రైవేటీకరించాలన్న ప్రయత్నాలు ఫలించలేదు. రెండు, మూడు కంపెనీల విక్రయానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, యంత్రాంగపరమైన జాప్యాల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన రెండు నెలల్లో సైతం పెద్ద మొత్తంలో డిజిన్వెస్ట్‌మెంట్ సొమ్ము సమకూరే అవకాశం లేదని డీబీఎస్ గ్రూప్ సీనియర్ ఎకానమిస్ట్ రాధికా రావు చెప్పారు. బీఈఎంఎల్, షిప్పింగ్ కార్పొరేషన్, హెచ్ఎల్ఎల్ లైఫ్, ఎన్ఎండీసీ స్టీల్ వ్యూహాత్మక వాటా విక్రయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే పూర్తిచేయాలన్న దూకుడును ప్రభుత్వం కనపర్చినప్పటికీ, ఇప్పటివరకూ వాటికి ప్రాథమిక బిడ్స్‌ను కూడా ఆహ్వానించలేదు. ఐడీబీఐ బ్యాంక్ విక్రయానికి 2023 జనవరిలోనే ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ అందినప్పటికీ, బిడ్డర్లకు ఇంకా రిజర్వ్‌బ్యాంక్ అనుమతులు లభించలేదు. ఈ నేపథ్యంలో డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యంలో ఏర్పడే లోటును ప్రభుత్వ కంపెనీలు ఇచ్చే డివిడెండ్లు, పన్ను వసూళ్లు సరిచేస్తాయని భావిస్తున్నట్టు తెలిపారు.

### ఎన్నికల తర్వాతే ప్రైవేటీకరణ


వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని గత ఏడాది నిర్దేశించుకున్న రూ.51,000 కోట్లకంటే తగ్గించుకుంటుందని రాధికారావు అంచనా వేశారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), షిప్పింగ్ కార్పొరేషన్ (ఎస్‌సీఐ), కంటైనర్ కార్పొరేషన్ (కాంకర్)లను పూర్తి వ్యూహాత్మక వాటాను విక్రయించడానికి ప్రభుత్వం గతంలోనే నిర్ణయించిందని, వీటి ప్రైవేటీకరణ లోక్‌సభ ఎన్నికల తర్వాతే జరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా, రైల్ వికాస్ నిగమ్, హడ్కో, ఎస్‌జేవీఎన్‌ల్లో కొద్దిపాటి వాటాను ఓఎఫ్ఎస్ ద్వారా ప్రభుత్వం విక్రయించగలిగింది. వచ్చే ఆరు నెలల్లో డిజిన్వెస్ట్‌మెంట్, ప్రైవేటీకరణ అంశాల్ని ప్రభుత్వం పట్టించుకుపోవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. యంత్రాంగపరమైన సవాళ్ల కారణంగా జాప్యం జరుగుతుందని, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులకు లోనవుతున్నందున ఆర్థిక మంత్రిత్వ శాఖ కొన్ని కంపెనీల డిజిన్వెస్ట్‌మెంట్ గడువులను మార్చవచ్చని ఆ వర్గాలు వివరించాయి.

### ద్రవ్యలోటు ఊరట

ఒక వైపు పన్ను వసూళ్లు పెరగడం, మరో వైపు అధిక డివిడెండ్ ఆదాయం సమకూరడంతో కేంద్ర ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించ గలుగుతుంది. 2023-24లో ద్రవ్యలోటు జీడీపీలో 5.9 శాతం ఉంటుందని గత బడ్జెట్లో అంచనా వేసింది. 2025-26కల్లా దీనిని 4.5 శాతానికి పరిమితం చేయాలన్న రోడ్‌మ్యాప్‌ను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రోడ్‌మ్యాప్ ప్రకారం 2024 ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 5.4 శాతానికి తగ్గించాల్సి ఉంటుంది.

## పసిడి దిగుమతులపై సుంకాన్ని తగ్గించండి

వచ్చే మధ్యంతర బడ్జెట్‌పై జెమ్స్, జ్యూవెల్లరీ ఇండస్ట్రీ వర్గాలు భారీ ఆశలు పెట్టుకున్నారు. బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని(బీసీడీ) తగ్గించాలని, పన్నులను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉన్నదని ఆభరణాల వర్తకులు కోరుతున్నారు. దేశ జీడీపీలో 7 శాతం వాటా కలిగిన ఆభరణాల ఇండస్ట్రీ కస్టమ్స్ సుంకం అధికంగా ఉండటంతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని, ముఖ్యంగా పాన్‌కార్డ్ ద్వారా జరిపే లావాదేవీల పరిమితిని పెంచాలని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యూవెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ సాయం మెహ్రా కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అలాగే పాన్ కార్డు ద్వారా బంగారం కొనుగోళ్ల పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని ఆభరణాల వర్తకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిమితి విధించడంతో భారీ స్థాయిలో కొనుగోళ్లు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం బంగారం ధరలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో పాన్ కార్డ్ పరిమితిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు బంగారాన్ని పెట్టుబడి సాదనంగా చూస్తారని చెప్పారు. అలాగే నెలవారి చెల్లింపులు(ఈఎంఐ)తో బంగారాన్ని కొనుగోలు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించాలని జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ వర్గాలు సూచిస్తున్నాయి.



# ఆర్బీఐ, బ్యాంక్‌ల నుంచి 70 వేల కోట్ల డివిడెండ్


ప్రస్తుత 2023-24ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్‌బ్యాంక్ నుంచి భారీ డివిడెండ్ అందుకున్న కేంద్ర ప్రభుత్వం మరో దఫా పెద్ద మొత్తాన్ని కేంద్ర బ్యాంక్ నుంచి అంచనా వేస్తున్నట్టు సమాచారం. వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ, బ్యాంక్‌ల నుంచి రూ.70,000 కోట్ల డివిడెండ్‌ను లక్ష్యంగా మధ్యంతర బడ్జెట్లో ప్రతిపాదిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టనున్నారు. గత ఏడాది బడ్జెట్లో ఆర్బీఐ, జాతీయ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల నుంచి రూ.48,000 కోట్ల డివిడెండ్ లక్ష్యాన్ని నిర్దేశించగా అంతకు రెట్టింపునకు పైగా ఆయా సంస్థల నుంచి కేంద్ర ఖజానాకు సమకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్‌బ్యాంక్ రూ.87,416 కోట్లు మిగులు మొత్తాన్ని డివిడెండ్ రూపంలో కేంద్రానికి బదిలీ చేయగా, బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు రూ. 30,307 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాయి. అంతేకాకుండా ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో మంచి ఆర్థిక ఫలితాల్ని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆర్బీఐ, బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల నుంచి రూ.70,000 కోట్ల డివిడెండ్‌ను అంచనా వేయడం సహేతుకంగా ఉంటుందని అధికార వర్గాలు వివరించాయి. 2022-23లో కేంద్ర ప్రభుత్వం ఆర్బీఐ, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల నుంచి రూ. 40,953 కోట్ల డివిడెండ్‌ను స్వీకరించింది. దానికి 17 శాతం అధికంగా 2023-24లో 48,000 కోట్ల లక్ష్యాన్ని బడ్జెట్లో నిర్దేశించగా, రూ.1.17 లక్షల కోట్ల వరకూ డివిడెండ్‌ను అందుకుంది.

## అయోధ్యకు 8 స్పైస్‌జెట్ విమానాలు

న్యూఢిల్లీ, జనవరి 30: అయోధ్యకు ఏకంగా రోజువారిగా ఎనిమిది విమాన సర్వీసులను నడుపబోతున్నట్లు స్పైస్‌జెట్ ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచి ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్, జైపూర్, పాట్నా, ముంబై, బెంగళూరుల నుంచి అయోధ్యకు రోజువారి విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఈ నూతన విమాన సర్వీసులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్యా సింధియా ప్రారంభించనున్నారు.

## ముత్తూట్ మైక్రోఫిన్ వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 30: రుణాలపై వడ్డీరేట్లను 55 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది ముత్తూట్ మైక్రోఫిన్. కొత్తగా తీసుకునే రుణాలతోపాటు పాత వాటికి కూడా ఈ తగ్గింపు వర్తించనున్నదని పేర్కొంది. గత రెండేండ్లుగా రుణాలపై వడ్డీరేట్లను 150 బేసిస్ పాయింట్లు పెంచిన సంస్థ..ఈసారి మాత్రం 55 బేసిస్ పాయింట్లు కోత విధించడం విశేషం. సరాసరిగా సంస్థ రుణాలపై 22.5 శాతం నుంచి 24.9 శాతం లోపు వడ్డీని వసూలు చేస్తున్నది.



## ఎల్అండ్‌టీ లాభం 2,947 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: దేశీయ మౌలిక సదుపాయాల సంస్థ లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్అండ్‌టీ) రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ. 2,947 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,552.92 కోట్ల లాభంతో పోలిస్తే 15 శాతం వృద్ధిని కనబరిచింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ ఆదాయం రూ.47,144.75 కోట్ల నుంచి రూ.55,965.57 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.